సాక్షి
కర్నూలు
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



రూ. 2 కోట్లతో మిల్లెట్స్‌యూనిట్

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం సమీపాన ఎకరా స్థలంలో రూ.2 కోట్లతో మిల్లెట్స్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. స్థలాన్ని గురువారం అధికారులు పరిశీలించారు.



రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణం కోసం కర్నూలుకు చెందిన తాండ్రపాడు ఉరుకుందయ్య శెట్టి రూ.1,11,116 విరాళంగా ఇచ్చారు.



డీటీలుగా పదోన్నతి

రెవెన్యూ శాఖలో 12 మంది సీనియర్ అసిస్టెంట్/ఎంఆర్‌ఐలకు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. 17 మంది రీసర్వే డీటీలకు రెగ్యులర్ డీటీలుగా పోస్టింగ్ ఇచ్చారు. 8లో

న్యూస్‌రీల్

శ్రీ మఠంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు చేశారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకు వచ్చిన ప్రత్యేక పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు. రాత్రి ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీ మఠం మాడ వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.

విద్యా, వసతి దీవెనకు రెన్యూవల్ చేసుకోవాలి

కర్నూలు(అర్బన్): జగనన్న విద్యా, వసతి దీవెనకు సంబంధించి 2023–24 విద్యా సంవత్సరానికి సెప్టెంబర్ 10వ తేదీలోగా కళాశాలలు రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు వారి లాగిన్‌లో రెన్యూవల్ రిజిస్ట్రేషన్‌కు ప్రతి విద్యార్థికి సంబంధించిన ఐదు సంవత్సరాల (2017–18 నుంచి 2021–22 వరకు) విద్యా నివేదికలను నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నమోదు చేయని పక్షంలో రెన్యూవల్స్ సాధ్యం కాదన్నారు. విద్యార్థులు అందించిన సమాచారాన్ని ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ జ్ఞానభూమి కళాశాల లాగిన్‌లో రిజిస్ట్రేషన్స్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ సమాచారాన్ని జగనన్న విద్యా, వసతి దీవెన పొందుతున్న విద్యార్థులకు తెలియజేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ నెల 11న(నేడు) జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి, 11 గంటలకు వ్యవసాయం, 12 గంటలకు సాంఘిక సంక్షేమం, 1 గంటకు విద్య, వైద్యం.. 2.30 గంటలకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, 3.30 గంటలకు ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించి ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశాలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రభుత్వ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీ కౌంటర్లలో తిరుమల టికెట్ల సంఖ్య పెంపు

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో తిరుమలకు వెళ్లే భక్తులకు జారీ చేసే ఆలయ దర్శన టిక్కెట్ల సంఖ్య పెంచినట్లు జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి టి.వెంకటరామం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాకు రోజుకు 600 టికెట్లు జారీ చేస్తుండగా ఈ నెల 15 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు రోజుకు 1000 టికెట్లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ల కోసం ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

ఇంటింటా ఓటరు సర్వే 20లోపు పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఇంటింటా ఓటరు సర్వేను ఆగస్టు 20వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేస్‌కుమార్ మీనా ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు సవరణ జాబితాపై సమీక్షించారు. ఒకే చిరునామాలో ఎక్కువ ఓట్లు ఉంటే విచారణ చేయాలన్నారు. వందేళ్లు దాటిన ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. ఓటు ఒక చోట ఉండి..ఓటరు మరో చోట నివాసం ఉంటే ఓటరు అభీష్టం మేరకు ఓటు ఎక్కడ ఉంచాలో నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఈఆర్‌ఓలు మల్లికార్జునుడు, రమ, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక చేయూత

- బ్యాంకు లింకేజీ రుణాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ అమలు
- 2022–23లో పొదుపు సంఘాలకు రూ.824.90 కోట్ల రుణాలు
- ఈ రుణాలపై వైఎస్సార్ సున్నా వడ్డీ నేడు విడుదల
- కోనసీమ జిల్లాలో బటన్ నొక్కి నిధులను విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 41,642 సంఘాలకు రూ.50.45 కోట్ల లబ్ధి



కర్నూలు సీ క్యాంప్‌లోని జగనన్న మార్ట్ వద్ద పొదుపు మహిళలు

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. బ్యాంకుల నుంచి తీసుకున్న లింకేజీ రుణాలకు వైఎస్సార్ సున్నా వడ్డీని అమలు చేస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మహిళల జీవనోపాధులు మెరుగుపడుతున్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లిస్తున్న అన్ని స్వయం సహాయక సంఘాలకు 2019–20, 2020–21, 2021–22 సంవత్సరాల్లో వైఎస్సార్ సున్నా వడ్డీని అమలు చేశారు. తాజాగా 2022–23 సంవత్సరానికి సంబంధించి నిధులను శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా కర్నూలు కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సృజన, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

41,642 సంఘాలకు లబ్ధి

ఇప్పటికే వరుసగా మూడేళ్లు వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులను విడుదల చేసిన ప్రభుత్వం 4వ ఏడాదికి నిధుల విడుదలకు రంగం సిద్ధం చేసింది. 2022–23 సంవత్సరానికి సంబంధించి గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 41,642 స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలకు రూ.50.45 కోట్లు విడుదల కానున్నాయి. డీఆర్‌డీఏ–వైకేపీ ఆధ్వర్యంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 29,814 స్వయం సహాయక సంఘాలకు రూ.31.91 కోట్లు, అర్బన్ ప్రాంతాలకు చెందిన 11,828 సంఘాలకు రూ.18.54 కోట్లు విడుదల కానున్నాయి. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు గరిష్టంగా రూ.20 లక్షల వరకు లింకేజీ రుణాలు ఇస్తున్నాయి. సక్రమంగా రికవరీ చేసిన సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ లభిస్తోంది.

లక్ష్యానికి మించి లింకేజీ రుణాలు

సున్నా వడ్డీ అమలతో రుణాల రికవరీ 100 శాతం ఉంటోంది. దీంతో బ్యాంకులు పోటీపడి స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తున్నాయి. 2022–23లో డీఆర్‌డీఏ–వైకేపీ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19,257 ఎస్‌హెచ్‌జీలకు రూ.824.90 కోట్లు లింకేజీ రుణాలు ఇచ్చారు. లక్ష్యం ప్రకారం రూ.697.56 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది.అయితే లక్ష్యానికి మించి రుణాలు అందజేశారు. అర్బన్ ప్రాంతాల్లో మెప్మా ద్వారా 4,419 సంఘాలకు రూ.319.48 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. మొత్తంగా బ్యాంకులు 23,676 సంఘాలకు రూ.1,144.38 కోట్లు రుణాలుగా పంపిణీ చేశాయి.

నాలుగేళ్లలో రూ.197.85 కోట్ల 'సున్నా వడ్డీ'

2019–20 నుంచి పొదుపు మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ అమలవుతోంది. శుక్రవారం విడుదల చేయబోయే నిధులతో సహా సున్నా వడ్డీ కింద జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలకు రూ.197.85 కోట్లు విడుదల చేసినట్లు అవుతుంది. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ అప్పు నిల్వ మొత్తాన్ని మాఫీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019–20 నుంచి తీసుకుంటున్న బ్యాంకు రుణాలకు సున్నా వడ్డీ అమలు చేస్తుండటం మహిళలకు పెద్ద ఉపశమనాన్ని ఇస్తోంది.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లిస్తే వైఎస్సార్ సున్నా వడ్డీ అమలు అవుతుంది. ఈ నెల 11న పొదుపు సంఘాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నావడ్డీ నిధులను బటన్ నొక్కి జమ చేయనున్నారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాలకు సంబంధించి 41,642 సంఘాలకు రూ.50.45 కోట్లు విడుదల కానున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధులను మరింత అభివృద్ధి చేసుకోవాలి.

– నాగశివలీల, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ–వైకేపీ, మెప్మా

సున్నావడ్డీతో జీవనోపాధి మెరుగు



నేను మదర్‌థెరిస్సా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. సున్నా వడ్డీ కింద మూడేళ్లలో మా సంఘానికి రూ.50,698 వచ్చింది. వ్యక్తిగతంగా నాకు రూ.5,070 చేయూత లభించింది. సున్నా వడ్డీ కింద వచ్చిన సాయాన్ని టైలరింగ్ మెటీరియల్ కోసం, చీరల వ్యాపారానికి వినియోగించుకుంటున్నా. సున్నావడ్డీతో జీవనోపాధిని మెరుగుపరుచుకున్నా.

–బి.సుమలత, ఒంటరిదిన్నె, గోనెగండ్ల మండలం

వివిధ వృత్తుల్లో రాణిస్తున్న మహిళలు

వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న తోడు వంటి పథకాలను అమలు చేస్తుండటంతో మహిళలు వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు. ఈ పథకాల కింద ఇప్పటి వరకు జిల్లాలోని మహిళలు రూ.1,500 కోట్లకుపైగా లబ్ధిపొందారు. పొదుపు మహిళలు సంఘటితమై సొంత పెట్టుబడితో కోడుమూరు, కర్నూలు సీక్యాంప్‌లో చేయూత మహిళా మార్ట్‌లు నడుపుతున్నారు. చాలా మంది సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధులను మెరుగుపరుచుకుంటున్నారు. కొంతమంది రొట్టెల తయారీ కేంద్రం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇంకొందరు పసుపు, కారం పొడి మిషన్లు ఏర్పాటు చేసుకున్నారు. పొట్టేళ్ల, పెరటికోళ్ల పెంపకంలో, పాడి పరిశ్రమలో, పాలకోవా తయారీలో మహిళలు రాణిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన సంఘాలకు సున్నా వడ్డీ నిధుల విడుదల వివరాలు..

నియోజకవర్గం	లబ్ధిపొందుతున్న సంఘాలు	4వ ఏడాది విడుదలవుతున్న నిధులు (రూ.కోట్లలో)
ఆదోని	2,037	2.30
ఆలూరు	5,608	5.50
కోడుమూరు	5,067	5.65
మంత్రాలయం	5,094	5.27
పాణ్యం (కల్లూరు, ఓర్వకల్)	2,648	3.10
పత్తికొండ	5,339	6.46
ఎమ్మిగనూరు	4,021	3.63
మొత్తం	29,814	31.91

అర్బన్ ప్రాంతాలకు చెందిన ఎస్‌హెచ్‌జీలకు సున్నా వడ్డీ నిధుల విడుదల వివరాలు..

మున్సిపాలిటీ	లబ్ధిపొందుతున్న సంఘాలు	4వ ఏడాదిలో విడుదలవుతున్న నిధులు (రూ.కోట్లలో)
ఆదోని	2,463	3.37
గూడూరు	525	1.04
కర్నూలు	7,000	11.02
ఎమ్మిగనూరు	1,840	3.11
మొత్తం	11,828	18.54

వరుసగా నాలుగేళ్లలో విడుదలైన సున్నా వడ్డీ వివరాలు..

సంవత్సరం	లబ్ధిపొందిన సంఘాలు	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
2019-20	30,935	48.52
2020-21	38,073	45.83
2021-22	42,186	53.35
2022-23	41,642	50.45

శాశ్వత లోక్‌అదాలత్‌లో మొదటి కేసు పరిష్కారం



రాజేశ్వరికి పరిష్కార పత్రం అందిస్తున్న శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు వెంకటహరినాథ్

కర్నూలు(లీగల్): కర్నూలో ఏర్పాటు చేసిన శాశ్వత లోక్ అదాలత్‌లో మొదటి కేసు మొదటి వాయిదాలోనే గురువారం పరిష్కారం అయినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు తెలిపారు. కర్నూలుకు చెందిన టి.రాజేశ్వరికి బజాజ్ అలియన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి దాదాపు రూ.2 లక్షలు రావాల్సి ఉంది. ఎన్నిసార్లు విన్నవించినా ఇన్సూరెన్స్ కంపెనీ స్పందించకపోవడంతో ఆమె శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. శాశ్వత లోక్ అదాలత్ వారు కంపెనీకి నోటీసు పంపడంతో కంపెనీ వారు హాజరై రాజేశ్వరికి ఇవ్వవలసిన పాలసీ డబ్బుతో పాటు అదనంగా రూ.4,164 పరిహారాన్ని ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్ మాట్లాడుతూ.. సేవల్లో లోపాలు ఉంటే శాశ్వత లోక్ అదాలత్‌ను సంప్రదించి సత్వరం పరిష్కరించుకోవాలన్నారు.

శ్రీశైలానికి నిలిచిన వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి గురువారం మధ్యాహ్నం నుంచి వరద ప్రవాహం నిలిచిపోయింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి జూరాలకు నీటి ప్రవాహం తగ్గిపోవడంతో జూరాల నుంచి శ్రీశైలానికి నీటి విడుదలను నిలిపివేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి 30,589 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి విడుదల అవుతుండగా మధ్యాహ్నం 1 గంట నుంచి జూరాలలో పూర్తిగా నీటి విడుదలను నిలిపివేశారు. బుధవారం నుంచి గురువారం వరకు ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో 11,355 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుని 5.746 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 123.0196 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 865.20 అడుగులకు చేరుకుంది.

ఆశాజనకంగా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు 16 మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గత నెలలో విస్తారంగా వర్షాలు కురిసినా.. కొద్ది రోజులుగా పొడి వాతావరణం ఏర్పడటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. మళ్లీ వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ పంటలపై రైతులకు ఆశలు పెరుగుతున్నాయి. కోడుమూరులో అత్యధికంగా 44.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున 7.3 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా మొదటి 10 రోజుల్లో 13.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 2,51,983 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ)
కల్లూరు	42.4
కర్నూలు అర్బన్	22.6
కర్నూలు రూరల్	14.8
గోనెగండ్ల	11.6

పంచాయతీ ఉప ఎన్నికలకు 104 నామినేషన్లు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 104 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఈ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈనెల 6వ తేదీన రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసిందన్నారు. జిల్లాలోని కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ సర్పంచ్ స్థానంతో పాటు వేర్వేరు గ్రామ పంచాయతీల్లో 42 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఖాళీగా ఉన్న ఈ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించామన్నారు. బదినేహాల్ గ్రామ సర్పంచు స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలు కాగా, 42 వార్డు సభ్యుల స్థానాలకు 100 నామినేషన్లు వచ్చాయని చెప్పారు. ఈ ప్రక్రియకు సంబంధించి 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన అభ్యర్థనల స్వీకరణ ఉంటుందన్నారు. 14వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, అదే రోజున పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు. ఈనెల 19వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుందని, అదే రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లను లెక్కించి గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఏవైనా అనుకోని సంఘటనలు జరిగితే 20వ తేదీన రీపోలింగ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.

పకడ్బందీగా నిర్వహించండి

కర్నూలు(సెంట్రల్): పంచాయతీ ఉప ఎన్నికలను ఆగస్టు 19వ తేదీన పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఉపఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు మద్యాన్ని నిషేధించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. ఆదోని నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. బయడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలలకు పంపుతున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

- విద్య, వైద్యరంగాల్లో అనేక మార్పులు
- సుంకేసుల నుంచి నీటి సరఫరా పెంచుతాం
- ప్రాజెక్టులు పూర్తి చేసి వలసలు నివారిస్తాం
- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో మంత్రి గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు

ఆదోనిటౌన్: సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివి అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. గురువారం ఆదోని పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్‌హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అధ్యక్షతన ఆదోని, ఆలూరు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ మంత్రితోపాటు కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆయా నియోజకవర్గాల్లోని అన్నిశాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. 14 ఏళ్ల చంద్రబాబు నాయుడు పాలనలో చేయలేని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. టీడీపీ హయాంలో రాబడి ఆరు శాతం ఉండగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 16 శాతానికి పెరిగిందన్నారు. విద్య, వైద్యరంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత లేదని, మౌలిక వసతులు పెరిగి ప్రతి రోజూ ఎంతో మంది ప్రాణాలు నిలుపుకుంటున్నారని, విపక్షాలకు ఇవి కనబడ లేదా అంటూ ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ కింద గత ప్రభుత్వంలో 300 జబ్బులకుగానూ రూ.1,200 కోట్లు ఖర్చు చేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1,200 జబ్బులకు రూ.3500 కోట్లు ప్రతియేటా ఖర్చు చేస్తోందన్నారు. గతంలో టైర్లు, ట్యూబులు, డ్రైవర్లు లేక 108 అంబులెన్స్‌లు మూలన పడి ఉండేవని, ప్రస్తుతం కొత్త వాహనాలతో సేవలందిస్తున్నామన్నారు.



సమీక్షకు హాజరైన అధికారులు

శరవేగంగా సమస్యల పరిష్కారం

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో సమస్యలను శరవేగంగా పరిష్కరిస్తున్న మంత్రి బుగ్గన తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నేషనల్ హైవేను సాధించినట్లు చెప్పారు. హంద్రీనీవా నీటితో 68 చెరువులకు నీరు నింపే ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా త్వరలోనే జాతికి అంకితం చేయనున్నట్లు చెప్పారు. సుంకేసుల నుంచి నీటి సరఫరా పెంచేందుకు రూ.120 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పత్తికొండలో రూ.30 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టామని, ఆలూరు నియోజకవర్గంలో వేదావతి ప్రాజెక్టును ప్రారంభించామని వివరించారు. తొమ్మిదేళ్ల చంద్రబాబు హయాంలో ప్రధాన నీటి ప్రాజెక్టులైన హెచ్ఎన్ఎస్ఎస్ సర్వేకు రూ.12 కోట్లు, జీఎన్ఎస్ఎస్‌కు రూ.17 కోట్లు, వెలిగొండకు రూ.18 కోట్లు ఇచ్చారన్నారు. అవే ప్రాజెక్టులకు రూ.3 వేల కోట్లకుపైగానే మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఖర్చు చేశారన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేసి ఆదోని ప్రాంతంలో వలసలను నివారిస్తామన్నారు. జలజీవన్ కమీషన్ కింద కర్నూలు జిల్లాకు రూ.400 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.170 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలుకు న్యాయరాజధాని అన్నది శ్రీబాగ్ ఒడంబడికలోని ప్రధాన అంశమన్నారు. ఆదోని ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఆదోని డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి, రెట్టింపు నిధులు కేటాయిస్తున్నామన్నారు.

హాలహర్వికి జూనియర్ కళాశాల

ఆలూరు నియోజకవర్గంలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నట్లు మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో జింకలు పార్కు ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ వసతి గృహాల ఏర్పాటు, జలవనరుల ప్రాజెక్టులు, నీటి పథకాల నిర్వహణ, కొత్త పథకాల మంజూరుపై సమావేశంలో మంత్రి చర్చించారు. ఆలూరులో షాపింగ్ కాంప్లెక్స్, సంతమార్కెట్, వంతెన నిర్మాణం చేపడతామని చెప్పారు. హొళగుంద బస్టాండు నుంచి ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వరకు సీసీ రోడ్డు నిర్మించడం, ఆలూరులో 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చడం, హాలహర్వికి జూనియర్ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

మరో ఏడాదిలో మెడికల్ కాలేజీ పూర్తి

ఆదోని నియోజకవర్గంలో నీటి సమస్య లేకుండా చేస్తామని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. రోడ్ల నిర్మాణం, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆదోనికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అధ్యాపకులను నియమించాలని కోరారు. మైనార్టీ ఐటీఐ కళాశాల, మహిళా జూనియర్ కాలేజీ, ఆటో నగర్ వంటి సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు మరో ఏడాదిలో పూర్తవుతాయన్నారు. ఆదోని ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారన్నారు.

క్లుప్తంగా

300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చాగలమర్రి: వెలుగోడు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 300 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారని సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్ తన సిబ్బందితో నంద్యాల నుంచి వెంబడించి చాగలమర్రి మండలం మద్దూరు మెట్ట వద్ద పట్టుకున్నారు. దాదాపు 300 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించి గురువారం ఆళ్లగడ్డ సీఎస్‌డీటీ సోమశేఖర్‌రెడ్డికి అప్పగించారు. లారీ డ్రైవర్ సికిందర్, దళారి వెంకటేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా వెలుగోడుకు చెందిన బియ్యం వ్యాపారి ఖలీల్‌కు చెందినవిగా గుర్తించి, అతని కోసం గాలిస్తున్నట్లు విజిలెన్స్ సీఐ తెలిపారు.

మట్టిమిద్దె కూలి వృద్ధురాలి మృతి


సావిత్రమ్మ (ఫైల్)


నందికొట్కూరు రూరల్: అల్లూరు గ్రామంలో మట్టి మిద్దె కూలి ఓ వృద్ధురాలు మృతి చెందింది. గ్రామానికి చెందిన సావిత్రమ్మ (65)కు ముగ్గురు కుమార్తెలు ఉండగా అందిరికీ వివాహాలయ్యాయి. ప్రస్తుతం వృద్ధురాలు మాత్రమే ఒంటరిగా మట్టిమిద్దెలో నివాసముంటోంది. గురువారం ఉదయం ఇంటిపైకప్పు ఒక్కసారిగా కూలి ఆమె మీద పడింది. గమనించిన స్థానికులు శిథిలాలను తొలగించి ఆమెను వెలికితీసేలోపు తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో అర్చకుడి దుర్మరణం


రాధాకృష్ణ (ఫైల్)

మనుబోలు(నెల్లూరు)/వెల్దుర్తి: నెల్లూరు జిల్లా వెంకన్నపాళెం సమీపంలో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ అర్చకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం గుంటుపల్లికి చెందిన శ్రీవైష్ణవ రాధాకృష్ణ(18) తన సోదరుడితో కలిసి మండలంలోని కట్టువపల్లిలో నివాసం ఉంటూ చుట్టుపక్క ఆలయాల్లో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం పారిచర్లపాళెంలోని ఆలయంలో పూజలు చేసేందుకు పల్సర్ మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. వెంకన్నపాళెం సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో రోడ్డు సైడ్ బరమ్స్ సక్రమంగా లేక బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బంధువులకు సమాచారం అందజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల




పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 8వగేటు వద్ద ల్యాడర్‌కు కట్టిన తాళ్లు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 గంటలకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ స్విచ్ ఆన్‌చేసి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. అనంతరం కృష్ణమ్మకు వాయనం సమర్పించనున్నారు. ఇక్కడి నుంచి విడుదలయ్యే కృష్ణా జలాలు శ్రీశైలం కుడి కాల్వ ద్వారా బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేరనున్నాయి. అక్కడ నుంచి ఉన్నతాధికారుల సూచన మేరకు తెలుగ, కేసీ, కేటాయించి మేరకు విడుదల చేయనున్నారు.

రెండు రోజుల్లో కేసీ కెనాల్‌కు..

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి రెండు, మూడు రోజుల్లో కేసీ కాల్వకు సాగునీటిని విడుదల చేసే అవకాశాలున్నాయని కేసీ కాల్వ ఏఈ నరేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల జలాశయంలోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. ప్రస్తుతం డ్యాంలో టీఎంసీ నీటిమట్టం ఉండగా వాటిని కర్నూలు తాగునీటి నిమిత్తం ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుతం సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు సాగునీటిని విడుదల చేసే అవకాశాల్లేనందున ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే ముచ్చుమర్రి నుంచి కేసీ కాల్వకు సాగునీటిని విడుదల చేస్తారని తెలిపారు. ఈ నీటిని 81 కిలోమీటరు నుంచి నిప్పులవాగు, తూడిచెర్ల సబ్ చానల్ కాల్వకు మళ్లించే అవకాశాలున్నాయని తెలిపారు.

'పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్'కు ముప్పులేదు..

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు ఎలాంటి ముప్పులేదని ఈఈ మనోహర్‌రాజు, డీఈ నాగేంద్రకుమార్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఓ దిన పత్రికలో పోతిరెడ్డి హెడ్‌రెగ్యులేటర్ గేట్‌కు ప్రమాదం ఉన్నట్లు కథనం ప్రచురితమైందని, కానీ నీటి ఉధృతికి గేటు కొట్టుకుపోవడం, కూలిపోయే అవకాశాలు లేవన్నారు. 80 టన్నుల బరువున్న గేటు జాయింట్‌ల వద్ద రోప్‌లు తుప్పుపట్టి ఊడిపోతే గేట్లు కిందికి జారుతాయే తప్పా కూలిపోవటం, కొట్టుకుపోవటం జరగదన్నారు. ఇటీవల గేట్లకు మరమ్మతులు నిర్వహించటంతో పాటు రబ్బర్‌సీళ్లను మార్పుచేయించామన్నారు. ఆ సమయంలో కిందికి దిగేందుకు ఏర్పాటు చేసిన నిచ్చెన (ల్యాడర్‌కు) కట్టిన రోప్‌ను చూసి గేటు కూలిపోకుండా ఇనుప తాళ్లు కట్టినట్లు పేర్కొనడం అవగాహన లేకపోవడమేనన్నారు. ఆయకట్టు రైతులు ఆందోళనకు గురి చేయవద్దని సూచించారు.

'ఆల్బెండజోల్'తో ఆరోగ్యం


విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, అధికారులు

ఆదోనిరూరల్: ఆల్బెండజోల్ మాత్రలు మింగిన విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంవత్సరానికి రెండుసార్లు పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 6,08,249 మందికి మాత్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, డీఎంఓ నూకరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రఘురామిరెడ్డి, టీబీ అధికారి భాస్కర్, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గిరికుమార్‌రెడ్డి, నాగరాజు


నూతన కమిటీ సభ్యులతో అధ్యక్ష, కార్యదర్శులు వి.గిరికుమార్‌రెడ్డి, సి.నాగరాజు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కర్నూలు జిల్లా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీఆర్‌ఎస్‌ఏ కర్నూలు జిల్లా యూనిట్ ఎన్నిక నిర్వహించారు. మూడేళ్ల కాల పరిమితి కమిటీ ఎన్నికకు వి.గిరికుమార్ ప్యానెల్ నుంచి మాత్రమే నామినేషన్‌లు వేశారు. దీంతో ఎన్నికల అధికారి బి.కామేశ్వరరెడ్డి ప్యానెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వి.గిరికుమార్‌రెడ్డి(డిప్యూటీ తహసీల్దార్, కల్లూరు), నాగరాజు(డిప్యూటీ తహసీల్దార్, హెచ్‌ఎన్‌ఎస్ యూనిట్-3 కార్యాలయం), అసోసియేటెడ్ అధ్యక్షుడిగా వి.రామాంజనేయరెడ్డి(డిప్యూటీ తహసీల్దార్, డీఎస్‌ఓ కార్యాలయం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.వీరేష్(సీనియర్ అసిస్టెంట్, పత్తికొండ), ట్రెజరర్‌గా ఐ.వేణుగోపాల్(ఏఓ ఆర్డీఓ కార్యాలయం) ఎన్నికయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


బనవాసిలో టిఫిన్ రుచి చూస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్/కోడుమూరు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. బనవాసి ఏపీ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీలను, కోడుమూరు మండలంలోని వర్కూరు అంగన్ వాడీ సెంటర్, కస్తూర్బా బాలికల పాఠశాల, కళాశాల బాయ్స్ హాస్టల్, కోడుమూరులో బాలికల హైస్కూల్, 17,18వ అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం మెనులో మార్పులు తెచ్చిందన్నారు. భోజన పథకంలో ఏమైనా సమస్యలంటే ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోర్టిఫైడ్ రైస్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. కోడుమూరులో 17, 18వ అంగన్‌వాడీ సెంటర్లలో రికార్డులను తనిఖీ చేసి ఓ గర్భిణితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. 18వ అంగన్‌వాడీ సెంటర్‌లో రెండు నెలల నుంచి ప్రతిరోజు 13 మంది చిన్నారులకు హాజరు వేసి ఈరోజు 11మందికి మాత్రమే హాజరు వేయడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ వెంట డీఎస్‌ఓ ఆచారి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజరావు, కోడుమూరు తహసీల్దార్ జయన్న ఉన్నారు.

ప్రజలతో మమేకమవుతూ 'గడపగడపకు'

- పుచ్చకాయలమాడలో ఎమ్మెల్యే శ్రీదేవికి అపూర్వ స్వాగతం
- రాళ్లురువ్విన టీడీపీ కార్యకర్తలు
- పోలీసుల అప్రమత్తతతో సజావుగా కార్యక్రమం


పుచ్చకాయలమాడలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గ్రామగ్రామానా వస్తున్న అపూర్వ ఆదరణ లభిస్తోంది. గురువారం పుచ్చకాయలమాడ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి గ్రామ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధిని గ్రామస్తులకు ఎమ్మెల్యే వివరించారు. గ్రామంలో సీసీ రోడ్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, జెడ్పీటీసీ సభ్యురాలు ఉరుకుందమ్మ, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, అంజినయ్య, నాయకులు శ్రీరంగడు, జగన్నాథ్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాళ్లు రువ్విన టీడీపీ కార్యకర్తలు

గ్రామంలో ఎమ్మెల్యే పర్యటనను టీడీపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు అడ్డుగా వచ్చి 'గోబ్యాక్' అంటూ కర్రలతో దాడి చేసేందుకు యత్నించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో టీడీపీ కార్యకర్తలు వెనక్కి వెళ్లారు. వారిలో కొందరు పాఠశాల వెనుకవైపు నుంచి రాళ్లు రువ్వారు. అయితే అవి ఎవరికీ తగలకపోవడంతో ఎలాంటి అపాయం జరగలేదు.

కారు బోల్తా.. ఇద్దరు యువకుల దుర్మరణం

- ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



మృతిచెందిన మారుతి, రమేష్ (ఫైల్)


బోల్తాపడిన కారు ఇదే

ఆలూరు రూరల్: కారు అదుపుతప్పి బోల్తా పడి ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘోర రోడ్డు ప్రమాదం గురువారం తెల్లవారు జామున 3 గంటలకు హాలహర్వి మండలం చింతకుంట గ్రామం సమీపంలోని కత్రవంక వద్ద జరిగింది. హాలహర్వి ఎస్‌ఐ నాగేంద్ర తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకి చెందిన ఏడుగురు స్నేహితులు మంత్రాలయానికి వెళ్తుండగా చింతకుంట వద్ద కారు బోల్తా పడింది. ప్రమాదంలో బళ్లారి పట్టణం పార్వతీ నగర్‌కు చెందిన మారుతి (25), బళ్లారి తాలూకా సింధిగేరి గ్రామానికి చెందిన రమేష్ అక్కడిక్కడే మృతిచెందాడు. వీరితో పాటు కారులో ఉన్న యువరాజు, నాగరాజు, మంజు, వీరేష్, విశ్వనాథ్‌కు గాయాలయ్యాయి. ప్రయాణీకులు సమాచారం అందించడంతో పోలీసులు క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి తీవ్రంగా గాయపడిన యువరాజుతో పాటు మిగిలిన వారందరిని మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆస్పత్రికి రెఫర్ చేశారు. మారుతి, రమేష్ మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు హాలహర్వి ఎస్‌ఐ నాగేంద్ర విలేకరులకు తెలిపారు.

సూగూరు విద్యార్థులకు అస్వస్థత


- చాక్లెట్లు, బిస్కెట్లు తిన్న తర్వాత కడుపునొప్పి
- కల్లుదేవకుంట ఆసుపత్రిలో చికిత్స


అస్వస్థతకు గురైన చిన్నారులు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని సూగూరు గ్రామానికి చెందిన 30 మంది విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. వీరంతా మంత్రాలయంలోని వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం వీరికి ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారు. సాయంత్రం గ్రామానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్టాండులో ఉండగా.. గుర్తు తెలియని వ్యక్తి ఒకరు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చాడు. వాటిని తిన్న తర్వాత బస్సెక్కిన కొందరు విద్యార్థులకు కడుపునొప్పి మొదలైంది. గ్రామానికి చేరుకున్న తర్వాత మరికొందరు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కల్లుదేవకుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులకు ఎలాంటి అపాయం లేదని మండల వైద్యాధికారిణి భావని చెప్పారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ.. ఆసుపత్రికి చేరుకొని విద్యార్థుల పరిస్థితిని పరిశీలించారు. అందరు క్షేమంగా ఉన్నట్లు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చికిత్స అనంతరం తల్లిదండ్రులు విద్యార్థులను తీసుకొని గ్రామానికి చేరుకున్నారు.

జిల్లాలో పశుసంవర్ధక శాఖ ప్రత్యేక అధికారి పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన లావణ్యలక్ష్మి గురువారం కర్నూలు జిల్లాలో పర్యటించారు. జిల్లాలో అమలవుతున్న పశుసంవర్ధక శాఖ కార్యక్రమాల పర్యవేక్షించారు. కర్నూలు మండలం బసాపురం గ్రామంలో పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో గ్రామీణ పశువైద్యశాల(ఆర్‌ఏల్‌యు)ను తనిఖీ చేశారు. గూడూరు మండలం కె.నాగలాపురం రైతుభరోసా కేంద్రంలో రైతులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కల్లూరులోని ఏరియా వెటర్నరీ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు.


అపురూప నివాళి

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ డ్రాయింగ్ షీట్‌పై 380 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను ఆవిష్కరించి నివాళులర్పించారు. ఏ3 డ్రాయింగ్ షీట్‌పై నీటి రంగులతో మైక్రో బ్రష్‌ను ఉపయోగించి దేశం కోసం ప్రాణాలను అర్పించిన అప్పటి దృశ్యాలతో పాటు స్వాతంత్ర్య సమరయోధులను చిత్రాలను చిత్రించారు. చిన్న వయస్సులో భారతోద్యమంలో ఉరికొయ్యలెక్కిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల చిత్రాలను గీశారు. 1919లో జరిగిన జలియన్ వాలాభాగ్ దురంతాలను చిత్రంలో చూపించారు.

– నంద్యాల(అర్బన్)

ఉద్యోగాల పేరుతో టోకరా

- ముగ్గురు మోసగాళ్లు అరెస్ట్
- సూత్రధారి, మరొకరు పరారీ
- రూ. 35 లక్షలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదుతో జిల్లా ఎస్పీ

బొమ్మలసత్రం: నిరుద్యోగులే లక్ష్యంగా కేటుగాళ్లు భారీగా మోసానికి పాల్పడ్డారు. డబ్బులిస్తే చాలు రైల్వే, ఇన్‌కం, అగ్రికల్చర్, సచివాలయ.. ఏ ప్రభుత్వ శాఖలోనైనా సరే ఉద్యోగం ఇప్పిస్తామంటూ నట్టేట ముంచేశారు. నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లతో బురిడీ కొట్టించి రూ. లక్షల్లో వసూలు చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో చివరకు కటకటాలు లెక్కపెడుతున్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. నందికొట్కూరుకు చెందిన ఉమాదేవి డిగ్రీ వరకు చదువుకుంది. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేసే సమయంలో ఆమె భర్త రాజుకు హైదరాబాద్‌లో ఉన్న సనాఉల్లాతో పరిచయం ఏర్పడింది. రైల్వే శాఖలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో ఉమాదేవి నుంచి రూ. 10 లక్షలు తీసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ఉద్యోగం వచ్చిందని నకిలీ అపాయింట్‌మెంట్ పత్రాన్ని అందించాడు. ఇది నమ్మిన రాజు తనకు తెలిసిన అరవింద్, నరసింహనాయుడు, సోమశేఖర్‌లకు కూడా ఉద్యోగం కావాలని సనాఉల్లాను ఆశ్రయించాడు. సనాఉల్లా స్నేహితులైన నటరాజశేఖర్, అనిల్‌కుమార్, వీరచైతన్య, అశోక్‌కుమార్‌రెడ్డితో కలిసి అగ్రికల్చర్, ఆదాయపు పన్ను శాఖ, సచివాలయ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ. 10 లక్షలు తీసుకున్నారు. వారందరికీ నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌లు తయారు చేసి పంపారు. అయితే బాధితులు తీరా ఆయా శాఖల వద్దకు వెళ్లి విచారిస్తే అవి నకిలీ పత్రాలను చెప్పారు. తాము మోసపోయామని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో కర్నూలు బస్టాండ్‌లో నటరాజశేఖర్, అనిల్‌కుమార్, అశోక్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సనాఉల్లా, వీర చైతన్య కోసం గాలిస్తున్నారు. గురువారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బందిని ఎస్పీ రివార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐ రమణ, సిబ్బంది రమణ, చెన్నయ్య, నాగార్జున, పురుషోత్తంరెడ్డి, శివ, మరశురామ్ పాల్గొన్నారు.

డబ్బులు పోగొట్టుకుని.. కేసులో ఇరుక్కుని!

- పురాతన నాణేల పేరుతో ఎర వేసిన కర్ణాటక వ్యక్తి
- రూ. 80 లక్షలు మోసపోయిన జిల్లా వాసి

అవుకు: మహిమలు ఉన్న పురాతన నాణేల కోసం రూ. 80 లక్షలు పోగొట్టుకోవడమే కాకుండా చివరకు కేసులో ఇరుకున్న వైనమిది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అవుకు పట్టణానికి చెందిన సాయన్నగారి నాగరాజుకు వెల్దుర్తికి చెందిన గోకారి సాహెబ్‌తో, అతని ద్వారా కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ చింతామణి తాలూకా గుడుమర్లహళ్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డితో పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల తరువాత పురాతన కాలం నాటి నాణేల్లో మహిమలు ఉంటాయని వాటిని అమ్మితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని, వాటిని తెప్పిస్తానని నాగరాజును గోకారి నమ్మించాడు. అందుకు నాగరాజు దాదాపు రూ.80 లక్షల వరకు గోకారికి ఇచ్చాడు. ఆ తర్వాత ఎలాంటి పురాతన నాణేలు ఇవ్వకపోవటంతో మోసపోయిన నాగరాజు గోకారిని నిలదీయగా తన స్నేహితుడు కృష్ణారెడ్డికి డబ్బులు ఇచ్చానని చెప్పాడు. డబ్బులు రాబట్టుకోవాలనే ఉద్దేశంతో రెండు రోజుల క్రితం కృష్ణారెడ్డిని అవుకుకి పిలిపించుకుని ఒక ఆశ్రమానికి సమీపంలో నిర్బంధించారు. బుధవారం రాత్రి కృష్ణారెడ్డిని నాగరాజుతో పాటు ఆకుమళ్ల పుల్లయ్య, ఆకుమళ్ల నాగేంద్ర, పసుపుల వెంకటేష్, నారాయణ, ఓబుళాపురం రవి, రాజు అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన ఇరిగంరెడ్డి బెల్టులతో, రాడ్లతో కొడుతూ తమ డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. గురువారం ఉదయం పిక్కళ్లపల్లి తండాకు చెందిన కొందరు రక్షించటంతో అవుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

12మంది సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతి

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ శాఖలో 12 మంది సీనియర్ అసిసెంట్/ఎంఆర్‌ఐలకు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ గురువారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీచేశారు. అయితే వీరికి స్థానాలను కేటాయించాల్సి ఉంది. మరోవైపు 17 మంది రీసర్వే డీటీలకు రెగ్యులర్ డీటీలుగా పోస్టింగ్ ఇచ్చారు. సెలవులో ఉన్న ముగ్గురు డీటీలకు స్థానాలను కేటాయించారు. వీరిలో కేవీ రమణబాబును జిల్లా సివిల్ సప్లై ఆఫీసుకు, అజీజ్ అహ్మద్‌కు ఆదోని మండల ఎలక్షన్ సెల్ డీటీగా, రవికుమార్‌ను నంద్యాల జిల్లాను కేటాయించారు.

డీటీలుగా పదోన్నతి పొందిన సీనియర్ అసిస్టెంట్లు

సీనియర్ అసిస్టెంట్/ఎంఆర్‌ఐ పేరు	పనిచేస్తున్న ప్రాంతం
ఎస్.అబ్దుల్ కలాం	కలెక్టర్ ఆఫీసు, కర్నూలు
వి.సుప్రియ	తహసీల్దార్ కార్యాలయం, జూపాడు బంగ్లా
పి.ఇమ్రాన్ హుస్సేన్	తహసీల్దార్ కార్యాలయం, కోయిలకుంట్ల
జి.జహీర్ హుస్సేన్	తహసీల్దార్ కార్యాలయం, డోన్
డి.శిరీష	తహసీల్దార్ కార్యాలయం, వెల్దుర్తి
సునీల్ రాజా	తహసీల్దార్ కార్యాలయం, డోన్
ఎం.లోకేష్‌రెడ్డి	హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3
జి.యువరాజు	కలెక్టర్ కార్యాలయం, కర్నూలు
ఎం.జ్యోతిర్మాయి	తహసీల్దార్ కార్యాలయం, ఆదోని
డి.మహ్మద్‌హుస్సేన్	ఆర్డీఓ ఆఫీసు, నంద్యాల
ఎం.ప్రీతమ్	కలెక్టర్ కార్యాలయం, కర్నూలు
షేక్ మహ్మద్ యాసిన్ బాష	ఆర్డీఓ ఆఫీసు, నంద్యాల

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc. ✆ 99493 08940 [B-319]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1907]

DMLT (బ్లడ్ టెస్ట్ కోర్స్)

■ లాస్ట్ డేట్ (ఆగస్టు 19th) DMLT (బ్లడ్ టెస్ట్ కోర్స్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్+ఫ్రీ హాస్టల్. Q : ఇంటర్ ఎనీ గ్రూప్. కాలేజీకి రాకపోయినా డైరెక్ట్ ఎగ్జామ్స్‌కి అవకాశం కలదు. సంప్ర : 8121661651. ATP. [A-2703]

REAL ESTATE

PLOT FOR SALE

■ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వెనుక శకునాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గరలో సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) ప్లాటు కేవలం 3 లక్షలు మాత్రమే. EMI సౌకర్యం కలదు. నితిక డెవలపర్స్, 98884 24222 [L-787403]

■ కర్నూలు నంద్యాల రోడ్, మారుతి హిల్స్ నందలి 2.75సెంట్లు, సిబ్లాక్, నందలి 3 సెంట్లు, ssid వారి హైవే హైటెక్ సిటి నందలి 3.50సెంట్లు గల మూడు ప్లాట్స్ అమ్మబడును. 9491343345, 7997130234 [G-7482]

LAND FOR SALE

■ Urgent Sale. 3 Acres Land for sale. (380x350 Size) in Tippaipalli Village, Near Orvakal. Per Acre 15 Lakhs Only. 75699 31552 [L-787412]

WANTED

■ అనుభవం గల ఆపరేషన్ థియేటర్స్ అసిస్టెంట్స్ కావలెను. సంప్ర: విజయ హాస్పిటల్, రెవిన్యూ కాలనీ, నంద్యాల రోడ్, కర్నూలు. ఫోన్: 08518-271009, 93478 50572 [L-787287]

■ కర్నూలు నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన మార్కెటింగ్ టీం (M/F) కావలెను. మంచి జీతం +ఇన్సెంటివ్స్+ గిఫ్ట్స్. సెల్: 90004 44852 [L-787286]

■ J.M. కంప్యూటర్స్ నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, Qly: Inter/Degree ట్రాన్స్‌పోర్టేషన్ బాయ్ కావలెను. # 1, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, Opp: క్రేజీ బాయ్స్, కర్నూలు. 98490 41008 [L-787284]

■ కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పనిచేయుటకు 39 (స్త్రీ/పు)లు కావలెను. జీ: 13 వేలు+ DA 6 వేలు + బోనస్ + ఫ్రీ రూం, అ: 10th - డిగ్రీ, ITI, డిప్లొమా(P/F). కల్లూరు రోడ్, కర్నూలు. సెల్: 8074816824 [L-787280]

■ క్లీనింగ్ సర్వీసెస్ నందు పనిచేయుటకు నెల జీతానికి వర్కర్స్ కావలెను. హౌస్, సంప్, బాత్రూం, టాయిలెట్స్, సిన్‌టెక్స్ ట్యాంక్ క్లీనింగ్ మొదలగునవి. 2 వీలర్ ఖచ్చితంగా ఉండాలి. శాలరీ+ ట్రావెలింగ్ అలవెన్స్ కలవు. సంప్ర: 98858 82404 [L-787265]

■ Wanted Hospital Executive-(1), Qly: Degree (Driving Licence, Two Wheeler Compulsary) Lady Operation Theatre Assistant -(1), ANM Sisters-(2), ఆయాలు–2 Salary As per the qualification and Experience. Contact: Radha Krishna Hospitals, Roja Lane, Prakash Nagar, KURNOOL. [L-787285]

■ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో వర్క్ చేస్తూ నెలకు 35,000/- వరకు సంపాదించుకొనే అవకాశం. పార్ట్ / ఫుల్ టైం, ఎటువంటి ఫీజుల ఉండవు. సంప్ర : 91217 48631 [V-797262]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 72074 45296 [V-6204]

■ నంద్యాల జిల్లాలో మండలాల వారిగా పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, జీతం: 15–20 వేలు, సంప్రదించండి: 8885722978. [C-777170]

■ JOB VACANCY: TIK PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 9346416039. [T-774233]

■ Wanted Female Telecallers, Manager & Executives. Salary : 10 k - 15k. Please Contact : 70930 99919, 89199 79777. [NA-11285]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221507]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికిM/Fఆయా,నర్సులు,వంట చేయువారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ:12000–35000/ ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7995374999 [HA-486]

■ MS కంపెనీ నందు ఇంటి నుంచి పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ఫీమేల్, Qly:10th, జీతం: 16,000-18,000 Ph: 9989923178/ 7075227337 [HA-498]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725